

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఛల్, ఛల్?** ఏయ్ ఛల్, ఛల్. అబ్బ ఎంత వేగంగా పరిగెత్తుతోందో. ఇంకా బాగా పరిగెత్తు ఛల్ ఛల్. పరిగెత్తు. ఇంకా గట్టిగా పరిగెత్తమంటే..

బాబోయ్. వద్దు - వద్దు ఆగు. పడిపోతాను. వద్దు ఆగమంటే ఆగు.. ఆగు.

ప...

...డి....

...పో...

....తు...

...న్నా....

...ను...

అయిదూ ఇరవై అయిదుకి ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి. నీరజ, దశరథరామయ్య భయంతో కూడిన ఆత్రుతతో చూశారు. కొన్ని క్షణాల్లో ట్రాలీ బయటకు వచ్చింది.

తెల్లటి ఇస్త్రీ దుప్పటి కప్పివుంది. రాజేష్ శరీరం మీద. మొహం మాత్రం కనబడుతోంది. గాఢ నిద్రలో వున్నట్లుగా వున్నాడు.

ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళినప్పుడు నవనవలాడుతున్న ఆ మొహం వాడిపోయి, పాలిపోయివుంది తోటకూరకాడలా.

ట్రాలీ వెనక బయటకి వచ్చిన శశిభూషణ్ వంక చూశారిద్దరూ. ఆయన మొహంలో కూడా ఎంతో అలసట. ట్రాలీ పన్నెండో నంబరు గదిలోకి వెళ్ళింది. నర్స్ పక్క సరిచేసింది. రాజేష్ మీద కప్పివున్న తెల్లటి దుప్పటిని జాగ్రత్తగా తీసింది.

రాజేష్ శరీరాన్ని చూడగానే చిన్నగా నీరజ కేకవేసింది. దశరథరామయ్య అవాక్కయి చూస్తూండిపోయాడు. సాంబశివరావు కడుపులో తిప్పడంతో బాత్ రూంలోకి వెళ్ళి రెండు చెవులూ చేతులతో మూసుకున్నాడు. అతనికి వామిట్ అయింది.

జాగ్రత్తగా మంచం మీద పడుకోబెట్టారు రాజేష్‌ని. శరీరం అంతా రక్తవిహీనం అయినట్లు తెల్లగా పాలిపోయింది. మొహం మాత్రం ప్రశాంతంగా వుంది.

రాజేష్ పొత్తికడుపు చుట్టూ తెల్లటి బేండేజీ కట్టివుంది. అది అక్కడక్కడా ఎర్రబడుతోంది. అదికాదు వాళ్ళని కలవరపెట్టింది.

రాజేష్ కడుపులోంచి అయిదు రబ్బరు ట్యూబ్స్ బయటకి వచ్చివున్నాయి. అంగం చివరనుంచి మరో ట్యూబ్, రాజేష్ పక్కనే మంచం మీద ఓ సంచి, ఆ సంచిలోకి రాజేష్ కుడిపక్క శరీరంలోంచి బయటకు వచ్చిన ఓ ట్యూబ్ కలపబడివుంది. పాలిథిన్ కవరుతో చేయబడ్డ ఆ సంచిలోకి ట్యూబ్ ద్వారా యూరిన్ స్వల్పంగా పాస్ అయివుంది.

"మెలకువ వచ్చేదాకా లేపకండి. మంచినీళ్ళు అడుగుతాడు కాని ఇవ్వకండి. ఇచ్చినా వాంతి అయిపోతుంది. ఇవాళంతా మత్తులోనే ఉంటాడు. మధ్యలో మెలకువ వచ్చినా కొద్దిసేపే. వెంటనే నిద్రపోతాడు. పలకరించకండి" చెప్పాడు డాక్టర్

"ఆపరేషన్ సక్సెసేనా?" అడిగాడు సాంబశివరావు.

డాక్టర్ శశిభూషణ్ రాజేష్ వంటిమీద దుప్పటి కప్పి చెప్పాడు.

"కిడ్నీని సెట్‌చేసి, బ్లేడర్‌ని క్లీన్ చేసి, పాసేజ్‌లో వున్న అబ్‌స్ట్రక్షన్‌ని ఆపరేట్ చేసి తొలగించాను. నెమ్మదిగా కోలుకుంటాడు. భయపడాల్సిన అవసరంలేదు."

సాంబశివరావు శశిభూషణ్‌కి ఓ కవరు అందించాడు. అది ఆయన ఫీజు. ఎనస్తీషియన్ ఫీజు.

"మీకేం అవసరం వచ్చినా డ్యూటీలో వున్న డాక్టర్ని పిలవండి. లేదా నాకు ఫోన్ చేయండి. అర్ధరాత్రయినా సరే ఇంటికి చేయండి."

తన విజిటింగ్ కార్డ్‌ని సాంబశివరావుకి ఇచ్చి చెప్పాడు.

దశరథరామయ్య కళ్ళు వత్తుకోవటం గమనించి ఆయన దశరథరామయ్య భుజం తట్టి నవ్వుతూ చెప్పాడు.

"పెద్దవారు మీరే అలా అధైర్యపడితే ఎలా? అంతా మంచే జరిగిందిగా, దేనికి మీరనవసరంగా బాధపడటం? జాగ్రత్తగా వినండి. అన్నిటికన్నా ముఖ్యం పిల్లవాడు నిద్రలో ట్యూబ్స్ పీకేసుకోకుండా చూడడం. మేలుకుని దగ్గరుండి చూసుకోవాలి."

డాక్టర్, నర్సులు వెళ్ళిపోయాక అంతా మంచం పక్కనే కుర్చీలు లాక్కుని రాజేష్ వంక చూస్తూ కూర్చున్నారు. దశరథరామయ్య రెండు మూడుసార్లు రాజేష్ చెంపలని తడిమాడు. కానీ ఆ స్పర్శే ఆ కుర్రాడికి తెలియలేదు.

సాయంత్రం చీకటి పడుతుండగా రాజేష్ ఓసారి కళ్ళు తెరిచి చూశాడు.

"రాజేష్! ఎలా వుంది?"

"పడిపోతున్నాను.."

"లేదు మంచం మీద వున్నావు."

"పడిపోతున్నాను. జిరాఫీ.."

మళ్ళీ గతంలోకి వెళ్ళిపోయాడు.

మరో గంటన్నరలోగా నాలుగయిదుసార్లు మెలుకువ వచ్చింది. ఎవరడిగిన ప్రశ్నలకీ సమాధానం చెప్పలేదు. ఎంతో కొత్తవాళ్ళని చూస్తున్నట్లు ఏదో తెలియని లోకంలో వున్నట్లు అయోమయంగా చూశాడు.

ఎవరికీ ఆకలి లేదన్నారు.

సాంబశివరావు టిఫిన్ పార్సెల్ తెస్తే అది తిన్నది నీరజ. దశరథరామయ్య పాలలో బ్రెడ్ నంచుకుని తిన్నాడు.

ఆ రాత్రి ఎవరూ భోజనం చేయలేదు. సాంబశివరావు థర్మాస్ ఫ్లాస్క్‌లో దగ్గరే వున్న ఓ హోటల్ నుంచి తెచ్చిన కాఫీ తాగారు.

రాత్రి పదింపావుకి రాజేష్‌కి మెలకువ వచ్చింది.

"దాహం" చెప్పాడు పెదవులని నాలికతో తడిచేసుకుని.

"పడుకో కాసేపాగి తాగుదువుగాని."

"దాహం. నాలిక"

దాదాపు మూడు నాలుగు నిముషాలు మెలుకువగా వున్నాడు. మళ్ళీ మత్తులోకి వెళ్ళిపోయాడు.

పదకొండింటికి చెప్పింది నీరజ.

"మీరిద్దరూ పడుకోండి. నేను మేలుకుని నిద్రలో ట్యూబ్ లాగకుండా చూస్తాను. నాకు ఎప్పుడు నిద్రవస్తే అప్పుడు మీలో ఒకరిని లేపుతాను."

సాంబశివరావు మంచం పక్కన, దశరథరామయ్య బాల్కనీలో ఇంటినుండి తెచ్చుకున్న చాపలు పరచుకుని నిద్రకి ఉపక్రమించారు.

అర్ధరాత్రి ఒకటిన్నరదాకా నీరజ రాజేష్ మంచం పక్కనే కుర్చీమీద తన క్లాస్ పుస్తకాలు చదువుతూ కూర్చుంది. రాజేష్ ఏ మాత్రం కదిలినా చేతులవంక చూస్తోంది ట్యూబ్ మీదకి వెళుతున్నాయేమోనని. నీరజ చదివే పుస్తకం పిల్లల పెంపకం గురించి ఓ యం.డి రాసింది.

చిన్న పిల్లలకి ఉదయం చిరాకుగా మొదలయితే అది ఆ రోజంతా వుంటుంది. తల్లి ఉదయం విమర్శలతో పిల్లల్ని సతమతం చేయకూడదు. పుస్తకాలు మర్చిపోయావనో లేదా స్కూలుకి లేటు అవుతుందనో లేదా షర్టుకి గుండీ పెట్టుకోవటం మర్చిపోయావనో ఇలాంటి విమర్శలు చిన్న పిల్లల చెవులకి చెడ్డ సంగీతంలాంటిది. రోజంతా అదే మనసులో వుంటుంది. చెప్పేది సలహాలా వుండాలికానీ విమర్శలా వుండకూడదు. ఇవాళ్ అకూడా పుస్తకాలు మర్చిపోతే మీ టీచర్ కోప్పడతారేమో? గడియారం చూస్తూ నీ పనులు చకచకా చేసుకుంటే ఇవాళ స్కూల్లో అందరికన్నా ఫస్ట్ వెళితే క్రెడిట్ లభిస్తుందనో, ఇవాళ మీ క్లాస్‌లో గుండీలన్నీ పెట్టుకుని ఎవరు నీట్‌గా వెళతారో చెప్పుకో చూద్దాం అనో.. అలా ఆ ఉదయం ఎంతో హాయిగా వుంటుంది పిల్లలకి.

రాజేష్‌కి మెలకువ వచ్చిందని గ్రహించి పుస్తకంలోంచి తలతిప్పి చూసింది నీరజ.

"అమ్మా! దాహం మంచినీళ్ళు" నూతిలోంచి వచ్చినట్లుగా వున్నాయా మాటలు.

"కాస్సేపాగి, కళ్ళు మూసుకుని పడుకో."

వాలిపోతున్న కనురెప్పలని బలవంతంగా తెరిచి ఉంచాడు రాజేష్.

"అమ్మా ఇంతకాలం ఎక్కడికెళ్ళావ్? ఎందుకు నన్ను వదిలేశావ్? అమ్మానేనేం తప్పుచేశాను? కాస్త మంచినీళ్ళివ్వవూ. బస్‌స్టాపులో కనబడ్డావుగా. పిలిచినా పలకలేదేం?" రాజేష్ ఏడుస్తూ లేవబోయాడు. నీరజ రాజేష్ భుజాలమీద తన చేతులు వుంచి చెప్పింది.

"వద్దు లేవకు. పడుకో."

"అమ్మా సత్యమునే పలకవలెను అని చెప్పావుగా. మరి అలవాటయితే దిగులు కూడా వుంటుందని ఎందుకు అబద్ధాలాడావ్? శ్రీరామ శ్రీరామ అనుకుంటే ఏం కాదని చెప్పావ్. అది అబద్ధమే. ఇంకెక్కడికీ వెళ్ళకమ్మా. నన్ను కన్నా అని పిలు. ఏదీ పిలు" మత్తులో రాజేష్ తననే సావిత్రి అనుకుంటున్నాడని అర్థమైంది. రాజేష్ తలమీద చిచ్చికొడుతూ చెప్పింది.

"ఎక్కడికీ వెళ్ళనులే. పడుకో కన్నా, నిద్రపో"

"ప్రామిస్..."

మళ్ళీ మత్తులోకి జారిపోయాడు. మరో పావుగంట తర్వాత కలవరించాడు.

"పట్టుకో అమ్మా. నన్ను పట్టుకో. వద్దన్నా వినకుండా జిరాఫీ పరిగెత్తుతోంది. నే పడిపోతున్నా.."

చిన్నగా నిట్టూర్చి మళ్ళీ పుస్తకంలోకి దృష్టిని మరల్చింది.

"చిన్న పిల్లలు పడటం మామూలే. దెబ్బ తగిలి తల్లి దగ్గరకు వచ్చినప్పుడు తల్లి చెప్పే మాటలు, ప్రవర్తనే పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. ఈ 'మైనర్ ఇంజురి సిండ్రోమ్' పిల్లల మనస్తత్వం మీద ఎంతగానో పనిచేస్తుంది.

"అయ్యో! నా బంగారు తండ్రీ నీ మోకాలు చూడు ఎలా గీక్కుపోయిందో? ఇలా వచ్చి పడుకో. ఓ కథ చెప్పనా?"

ఇది యితరులమీద ఆధారపడే మనస్తత్వాన్ని సృష్టిస్తుంది.

"వెధవన్నర వెధవా వేలెడు లేవు సైకిలు నేర్చుకుంటావా? మందు వేస్తాపద. ఇంకెప్పుడూ నీ జన్మలో సైకిలు తొక్కకు."

ఏ పని చెయ్యాలన్నా భయం మొదలవుతుంది. భయస్థుడిగా మారతాడు.

"ఏడవకురా బుజ్జీ. అది నీ తప్పుకాదు. ఆ వెధవ సైకిలు తప్పది. అసలు గుంటలున్న ఆ రోడ్డు తప్పది. ఆ రోడ్డునీ, సైకిలు నీ కొడదామేం."

దీనివల్ల తన తప్పులుకి ఇతరులు బాధ్యులు అనే సైకాలజీ ఏర్పడుతుంది. ప్రతిదానికి ఇతరులను నిందిస్తారు.

"పోనీలే. సైకిల్ నేర్చుకునే ప్రతివాళ్ళూ పడటం మామూలే. బాండ్ ఎయిడ్ వేస్తా పద."

ఈ మాటవల్ల ఎలాంటి పరిస్థితులకీ ఇతరులమీద ఆధారపడకుండా, ఇతరులని అందుకు బాధ్యులని చేయకుండా సరయిన పద్ధతిలో ఆలోచించడం మొదలవుతుంది.

తరచు అనేక విధాలుగా రిపీట్ అయ్యే యిలాంటి బాధ్యతే పిల్లల మనస్తత్వాలని తీర్చిదిద్దుతాయి."

నీరజ పుస్తకం మడిచి పక్కన పెట్టింది.

'సావిత్రి ఖచ్చితంగా చక్కటి చైల్డ్ సైకాలజిస్ట్' అనుకుంది. ఆమె ఆలోచనలు తను ఎన్నడూ చూడని సావిత్రి మీదకు మళ్ళాయి.

రెండూ ముప్పావుకి సాంబశివరావు లేచి చెప్పాడు భార్యతో.

"ఇంక పడుకో. నేను కూర్చుంటాను."

"జాగ్రత్తండి. నిద్రలో తెలీక ట్యూబ్స్ పీకేసుకుంటే ప్రమాదం" హెచ్చరించింది నీరజ.

పడుకున్న అయిదు నిముషాలకే నీరజని నిద్రాదేవి ఆవహించేసింది.

సాంబశివరావు నిద్రపోతున్న రాజేష్‌ని చూస్తూ కూర్చున్నాడు. 'ఈ పిల్లవాడికి ఏం కాకపోతే బావుండును' అనుకున్నాడు.

ఒకప్పుడు పట్టుబట్టి తను అబార్షన్ చేయించకపోయివుంటే, ఆ గర్భం నిలిచి వుంటే, ఆ ప్రాణం ఇంత అందంగా వుండేదా?

వంగి రాజేష్ అరచేతి మీద ముద్దుపెట్టుకున్నాడు.

దశరథరామయ్య ఉదయం అయిదున్నరకి మెలుకువ వచ్చేదాకా రాజేష్ పక్కనే కూర్చున్నాడు. సాంబశివరావు ఆయన స్నానం చేసి వచ్చాక పడుకున్నాడు.

ఉదయం ఏడున్నరకి మెలుకువ వచ్చింది నీరజకి. లేచి రాజేష్ దగ్గరికి వెళ్ళి చూసింది. బాధగా మూలుగుతూ శ్రీరామ శ్రీరామ శ్రీరామ అనుకుంటున్నాడు. దశరథరామయ్య వంక ఆదుర్దాగా చూసింది.

"మెలకువ వచ్చీరాకుండా వుంది. మంచినీళ్ళడిగితే తాగించాను. అరగ్లాసు కూడా సరిగ్గా తాగలేదు."

ఉదయం రౌండ్స్‌కి వచ్చిన డాక్టరు రాజేష్ టెంపరేచర్ చూసి, చార్ట్‌లో రాసి చెప్పాడు.

"యూరిన్ బేగ్ సగందాకా నిండివుంది. దాన్ని ఖాళీచేసి మళ్ళీ తగిలించండి. బేగ్ తీసినప్పుడు ట్యూబ్ చివర బిరడా వుంచండి. ఇలా.." ట్యూబ్ నించి బేగ్ తీసి చూపించాడు.

దశరథరామయ్య ఆ బేగ్‌తో బాత్ రూంలోకి వెళ్ళి, దాన్ని ఖాళీచేసి తీసుకువచ్చాడు. మళ్ళీ ట్యూబ్‌కి దాన్ని తగిలించాడు. డెట్టాల్ నీళ్ళతో చేతిని శుభ్రంగా కడుక్కున్నారిద్దరూ.

రాజేష్ కి మెలకువ వచ్చింది. నీరజ తడిబట్టతో తుడుస్తుంటే కళ్ళు తెరచి చూశాడు.

"నొప్పి, నొప్పి శ్రీరామ శ్రీరామ శ్రీరామ" చెప్పాడు గిలగిలలాడుతూ.

"ఎక్కడ?" అడిగింది.

పొత్తికడుపువైపు చూపించాడు మొహం బాధగా పెట్టి.

"ఎక్స్‌రే తీయడం వల్ల నొప్పిగా వుంది. తగ్గిపోతుంది" చెప్పింది.

"మొన్నటిసారి ఎక్స్‌రే తీస్తే నొప్పి లేదుగా?" అడిగాడు బలహీనంగా.

"తగ్గిపోతుంది" చెప్పాడు దశరథరామయ్య బాధగా.

ఇరవైనాలుగ్గంటలూ తండ్రో, కొడుకో, కోడలో ఎవరో ఒకరు వంతులవారీగా రాజేష్ పక్కన కూర్చుని చేతులతో ట్యూబ్సుని పీక్కోకుండా చూస్తున్నార్.

"ఇవేంటి?" అడిగాడు రాజేష్ మధ్యాహ్నం ట్యూబ్స్‌ని చూసి.

"ట్యూబ్స్. వాటిని ముట్టుకోకూడదు" చెప్పింది నీరజ.

"డాక్టరంకుల్ పెట్టాడా? ఎందుకు?"

మొదటి మూడురోజులూ రాజేష్ సరిగ్గా స్పృహలోలేడు. నొప్పి తెలియకూడదని పెయిన్ కిల్లర్స్, నిద్రమందు ఇస్తూనే వున్నారు. కాసేపు స్పృహలోకి వచ్చినా మళ్ళీ వెంటనే మత్తులోకి జారిపోతున్నాడు. మూడో రోజు డాక్టర్ అందర్నీ బయటికి వెళ్ళమని కట్టుమార్చి, ఆరింట్లో ఓ ట్యూబ్‌ని తీసేశాడు. కట్టు మారుస్తున్నంతసేపు రాజేష్ విలవిలలాడిపోయాడు.

"వద్దు. యూ డర్టీ ఇడియట్ అంకుల్" అరిచాడు శశిభూషణ్ మీద కోపంతో కూడిన బాధతో.

చిన్నగా నవ్వి చెప్పాడు శశిభూషణ్.

"అంకుల్స్ ఎక్కడయినా ఇడియట్స్‌గా వుంటారా?"

రాజేష్ నవ్వాడు.

నాలుగో రోజునుంచి సాంబశివరావు బేంక్‌కి వెళ్ళసాగాడు. దశరథరామయ్య, నీళ్ళ్‌యిద్దరూ హాస్పిటల్‌లోనే వున్నారు.

మొదటి మూడురోజులూ రాజేష్‌కి భోజనాన్ని ద్రవరూపంలో ఇవ్వవలసిందిగా చెప్పాడు డాక్టర్. గ్లూకోస్ నీళ్ళు, బత్తాయి రసం, హార్లిక్స్, బూస్ట్, పాలు మార్చి మార్చి యివ్వసాగారు. మొదటి రెండురోజులు రోజుకి రెండు బాటిల్స్ చొప్పున గ్లూకోస్ వాటర్‌ని ఎక్కించారు. మూడోరోజు ఒకే బాటిల్ ఎక్కించారు.

"యూరిన్ బాగా తయారవుతుండాలి. సాధ్యమైనంత ఎక్కువ ద్రవపదార్థాలు తాగిస్తూండండి. ఇక గ్లూకోస్ వాటర్ ఎక్కించడంలేదు" చెప్పాడు శశిభూషణ్.

నాలుగోరోజు మధ్యాహ్నానికి రాజేష్‌కి మత్తు పూర్తిగా వదిలింది.

"నాకేం చేశారు?" అడిగాడు పొట్టమీద కట్టును గమనించి.

"ఆపరేషన్" చెప్పాడు సాంబశివరావు.

"తాతయ్యా!" పిలిచాడు రాజేష్. ఆయన దగ్గరికి రాగానే "మరి ఆపరేషన్ కాదని వట్టేశావు కదా దాన్ని తీసి గట్టుమీద పెట్టమన్నాను. పెట్టావా?" అడిగాడు.

"పెట్టాన్రా" నవ్వాడాయన.

"ఇంకెప్పుడూ అసత్యాలు చెప్పకు."

"అవసరం అయినప్పుడు అబద్దాలు ఆడటంలో తప్పేంలేదురా భడవకానా."

"మా అమ్మ నాకా సంగతి ఎప్పుడూ చెప్పలేదు."

"నే చెప్తున్నాగా"

"అంటే నా పొట్టకోశారా?" కాస్సేపాగి ఆలోచనగా అన్నాడు.

"కొద్దిగా."

"మరి నాకు నొప్పి తెలీలేదే?"

"తెలీకుండా చేశారు"

కుడి చేతిలో ఎడం చేతిని గిల్లి చూసుకుని ఆశ్చర్యంగా అడిగాడు.

"పొట్ట కోస్తుంటే నొప్పి తెలియకుండా ఎలా వుంటుంది?"

"ఆపరేషన్ థియేటర్‌లో ఏం చేశారో నీకు గుర్తులేదా?" అడిగాడు సాంబశివరావు.

"ఊహూ. డాక్టరంకుల్ ఒకట్లు లెక్కపెట్టమని చెప్పి ఏదో ఇంజక్షన్ యిచ్చాడు. అంతే. వెంటనే మాయమయిపోయాను. మళ్ళీ ఈ గదిలో తేలాను."

"జిరాఫీలు కనిపించాయా కలలో?" అడిగింది నీరజ.

"జిరాఫీనా? ఏమో గుర్తులేదు."

అయిదోరోజు ట్యూబ్ చివర వున్న బేగ్‌ని చూశాడు.

"ఇదేమిటి?" అడిగాడు ఆశ్చర్యంగా.

"నీకు ఆపరేషన్ అయిందిగా కొంతకాలం నీ వంట్లోంచి యూరిన్ ఈ ట్యూబుద్వారా బయటికి వస్తుంది. తర్వాత ట్యూబ్ తీసేస్తారు" చెప్పాడు దశరథరామయ్య.

"ఏంటో అంతా గమ్మత్తుగా వుంది."

రాజేష్‌ని హాస్పిటల్లోకి తీసుకొచ్చిన రోజుకీ, ఆ రోజుకీ ఎంతో తేడా. బాగా నీరసంగా వున్నాడు. మొహం పెదవులు పాలిపోయి వున్నాయి. అటునుంచి యిటు తిరగాలన్నా శక్తిలేదు. ఎవరో ఒకరు తిప్పాలి.

"అమ్మ ఎందుకు రాలేదు?" అడిగాడు రాజేష్ నీరజని.

"వస్తుంది."

"అమ్మకి తెలియదు. తెలిస్తే తప్పకుండా వచ్చేది" అన్నాడు విచారంగా.

"మీ అమ్మ నిన్ను 'కన్నా' అని పిలుస్తుందా?" అడిగింది నీరజ.

"అవును. అమ్మ చెప్పిందా మీకు?"

"అవును"

"మీకు అమ్మ ఎప్పుడు కనబడింది?"

"నీ చిన్నప్పుడు."

"నా చిన్నప్పుడా? అయితే మీకు అమ్మ తెలుసన్నమాట."

"తెలుసు."

కాసేపు టింకూ తలమీద కుడిచేతితో రాస్తుండిపోయాడు. తర్వాత చెప్పాడు.

"ఆంటీ నాకు చదువుకోడానికి ఏమైనా పుస్తకాలు తెచ్చివ్వరా బోరుగా వుంది."

"అలాగే ఏ పుస్తకాలు చదువుతావు?"

"అదివ్వండి."

టేబుల్ మీదున్న వారపత్రికని అడిగి తీసుకుని పేజీలు తిరగేయసాగాడు.

సిస్టర్ వచ్చింది. రాజేష్ మీద కప్పి వున్న దుప్పటిని తీసి, తడి బట్టతో తుడవసాగింది.

"మీరెందుకు ఈ పని చేస్తారు? నాకివ్వండి ఆంటీ" చేతులు చాపాడు రాజేష్.

"ఫర్వాలేదు"

"థాంక్స్ ఆంటీ" సిస్టర్ యూరిన్ బేగ్‌ని ట్యూబ్ నించి తీసి బాత్‌రూములోకి తీసుకెళ్ళి దాన్ని ఖాళీచేసి తీసుకొచ్చి మళ్ళీ ఈ ట్యూబ్‌కి తగిలించింది.

"ఏం అనుకోకండి ఆంటీ మీ చేత ఈ పనులన్నీ చేయించుకుంటున్నందుకు" నొచ్చుకుంటూ చెప్పాడు రాజేష్.

"ఇట్సాల్ రైట్"

ఆ ఫ్లోర్‌లో వున్న పదిహేను గదుల్లోని పేషెంట్స్ అందరిలో రాజేష్ ఒక్కడే చిన్నవాడు. లేచి తిరగగలిగే పేషెంట్స్, ఆ పేషెంట్స్ వెంట వుండేవాళ్ళు వచ్చి తరచూ రాజేష్‌ని చూసి కాసేపు కబుర్లు చెప్పి వెళుతున్నారు. మొగవాళ్ళని అంకుల్ అని, ఆడవాళ్ళని ఆంటీ అని సంబోధిస్తూ మాట్లాడతాడు రాజేష్. డాక్టర్ శశిభూషణ్ కూడా రాజేష్‌ని మెచ్చుకున్నాడు. ఆ వయసులో అంత కో ఆపరేటివ్‌గా వుండే పేషెంట్స్ అరుదుకాబట్టి.

ఆరో రోజు మిగతా నాలుగు ట్యూబ్‌లు తీసేశారు. ఇంకా యూరిన్ బేగ్‌కి కనెక్ట్ చేయబడ్డ ఒక్క ట్యూబ్ మాత్రమే వుంది. ఆ రోజు రాజేష్‌కి రక్తం ఎక్కించారు. యూరిన్ ఇన్‌ఫెక్షన్ కాకుండా వుండటానికి రెగ్యులర్‌గా వాడే టాబ్లెట్స్, టానిక్స్ తప్ప వేరే మందులేం వాడటంలేదు.

ఆ రోజు సాయంత్రం అడిగాడు రాజేష్.

"నా డ్రాయింగ్ బాక్స్, స్కెచ్‌పెన్స్ తీసుకురా పిన్నీ, బొమ్మలు గీస్తాను."

"నీకు ఓపిక లేదుగా" చెప్పింది నీరజ.

"ఉంది."

"సరే"

రోజూ ఉదయం రాజేష్‌కి చదివి వినిపిస్తాడు దశరథరామయ్య. తనకొచ్చిన అనుమానాలని అడుగుతుంటాడు రాజేష్. ఆ సందేహాలు తీర్చటం దశరథరామయ్య దినచర్యలో ఓ భాగం.

ఏడోరోజు ఉదయం హెడ్ రెస్ట్‌కి ఆనుకుని బొమ్మలు గీయడానికి ప్రయత్నించాడు. కానీ కుదరలేదు చాలాసేపు. నాలుగైదు గంటలు తంటాలు పడ్డాక ఓ బొమ్మని తనకి తృప్తికరంగా గీయగలిగాడు.

అది టింకూ బొమ్మ.

అట్టే స్ట్రైయిన్ అవకూడదని ఆ రోజుకి డ్రాయింగ్ మెటీరియల్‌ని తీసేసుకుంది నీరజ.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in